సాక్షి గుంటూరు

ఆదివారం, 29, డిసెంబర్, 2024



వెండి నంది విగ్రహం అందజేత

పిడుగురాళ్ల: పట్టణంలోని శివాలయానికి ఐదు కేజీల నంది విగ్రహాన్ని ఈవో సుబ్బారెడ్డి సమక్షంలో పెరుమాళ్ల రాజేష్, వనజలక్ష్మి దంపతులు శనివారం అందజేశారు.



ధనుర్మాస మహోత్సవాలు

తాడేపల్లి రూరల్: ఆత్మకూరులోని బాపూజీ విద్యాలయంలో ధనుర్మాస మహోత్సవాలలో 13వ పాశురాన్ని శనివారం శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి భక్తులకు వివరించారు.



ఘనంగా వెంకన్న కల్యాణం

భట్టిప్రోలు: స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శనివారం అలివేలు మంగ, పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి 25వ వార్షిక కల్యాణం ఘనంగా జరిగింది.

న్యూస్‌రీల్

హర్షిల్ కిరణ్‌ను అభినందించిన జిల్లా కలెక్టర్



గుంటూరు వెస్ట్: గుంటూరు నారాయణ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న హర్షిల్‌ను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో అభినందించారు. హర్షిల్ కిరణ్ తీసిన ఛాయా చిత్రాలతో 2025 క్యాలెండర్‌ను తయారు చేశారు. దీనిని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హర్షిల్ తీసిన పక్షులు, అటవీ జంతువులు, ప్రకృతి రమణీయ చిత్రాలు చూసి అభినందించారు. జాతీయ స్థాయిలో ఛాయా చిత్ర పోటీల్లో వచ్చిన బంగారు పతకాన్ని కూడా ఆమె బాలుడి మెడలో వేశారు. కార్యక్రమంలో హర్షిల్ తండ్రి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

31న చేబ్రోలులో జాబ్ మేళా

చేబ్రోలు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 31న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వి. శ్రీదేవి శనివారం తెలిపారు. సిద్ధి వినాయక బజాజ్, అపెక్స్ సొల్యూషన్స్, ఇన్నోవాసోర్స్ కంపెనీలు హాజరవుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన యువతీ, యువకులు పాల్గొనాలని ఆమె కోరారు.

రైలులో తప్పిపోయి తెనాలి వచ్చిన బాలిక



తెనాలి రూరల్: రైలులో తప్పిపోయి తెనాలి వచ్చిన బాలికను గుర్తించి బంధువులకు జీఆర్పీ పోలీసులు అప్పగించారు. నల్గొండ జిల్లా నకరికల్లు మండలానికి చెందిన 16 ఏళ్ల దోలూరి నిహారిక తప్పిపోయి డెల్టా ఎక్స్‌ప్రెస్‌లో తెనాలి వచ్చింది. బాలికను ప్లాట్‌ఫాంపై జీఆర్పీ పోలీసులు శుక్రవారం రాత్రి గుర్తించారు. బాలిక నుంచి వివరాలు కనుక్కొని వారికి సమాచారం అందించారు. బాలిక మేన మామ వెంకటరెడ్డి, బంధువులు శనివారం తెనాలి రాగా వారికి అప్పగించారు.

వేళంగణి వేడుకలకు ప్రత్యేక రైలు

లక్ష్మీపురం: నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా వేళంగణి వేడుకలకు ప్రత్యేక రైలును కేటాయించినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం డాక్టర్ ప్రదీప్‌కుమార్ శనివారం రాత్రి తెలిపారు. రైలు నంబరు (07125) సికింద్రాబాద్ – వేళంగణి రైలు ఈనెల 30న సికింద్రాబాద్ నుంచి రాత్రి 8 గంటలకు బయల్దేరి మరుసటి రోజు రాత్రి 7.30 గంటలకు వేళంగణి స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. (07126) వేళంగణి – సికింద్రాబాద్ రైలు జనవరి 1న వేళంగణిలో రాత్రి 10 గంటలకు బయల్దేరి మరుసటి రోజు రాత్రి 10.40 గంటలకు సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. ప్రత్యేక రైలు నల్గొండ, మిరియాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, మాల్‌పాకం, కాట్పాడి, వేలూరు, తిరునామల్లై, విల్లుపురం, మీదుగా నాగపట్నం స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు.


బంగారం షాపులో చోరీ



పట్నంబజారు: బంగారం దుకాణానికి చెవిటి, మూగ వ్యక్తిలా వచ్చి ఆభరణాలు దోచుకుని పోయిన సంఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్నంబజారులో రియాజుద్దీన్ నిజాం జ్యూయలరీ షాపు నిర్వహిస్తున్నాడు. శనివారం గుర్తు తెలియని వ్యక్తి తాను మూగ, చెవిటి అని సర్టిఫికెట్ తీసుకొచ్చి, ఆర్థిక సాయం కావాలంటూ షాపు నిర్వాహకులను అడిగాడు. ఈ సమయంలో తన వద్ద ఉన్న టవల్‌ను టేబుల్‌పై ఉన్న బంగారు ఆభరణాల బాక్సుపై వేసి చాకచక్యంగా వెంట తీసుకుని వెళ్లాడు. 208 గ్రాముల బంగారం విలువ రూ. 15 లక్షలు ఉంటుంది. లాలాపేట పోలీసులు, సీసీఎస్ విభాగం సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నారు. నిందితుడి ఆచూకీ కోసం చర్యలు చేపట్టారు.

అధి'కారం' ఎవరిదో ?

- మిర్చి యార్డ్‌పై పట్టు కోసం జనసేన, టీడీపీ నేతలు
- చైర్మన్ పదవి కోసం పెరుగుతున్న పోటీ
- పట్టుబడుతున్న టీడీపీ సామాజిక వర్గం
- కార్యదర్శి కోసం ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ కోడలి ప్రయత్నం
- ఆమె భర్త ఇక్కడ నిఘా అధికారి
- అడ్డుకున్న స్థానిక ప్రజాప్రతినిధులు



సాక్షి ప్రతినిధి, గుంటూరు: జిల్లాలో కీలకమైన మిర్చి యార్డుపై పట్టు కోసం కూటమిలో పోరు మొదలైంది. చైర్మన్ పదవి కోసం తెలుగుదేశం, జనసేన నాయకులు పట్టుబడుతున్నారు. ఆదాయం వచ్చే పోస్టు కావడంతో ఆశావహుల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. ఈ పదవి కోసం పెద్దఎత్తున ప్రయత్నాలు చేస్తున్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ పదవి కమ్మ సామాజిక వర్గానికే దక్కుతూ వచ్చింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత బీసీ సామాజి కవర్గాలకు చెందిన చంద్రగిరి ఏసురత్నం, నిమ్మకాయల రాజనారాయణలకు ఈ పదవి దక్కింది. ఈసారి కూడా తమకే దక్కాలని కమ్మ సామాజికవర్గం నేతలు అధిష్టానంపై గట్టిగా ఒత్తిడి తెస్తున్నారు. కీలకమైన పదవి కావడంతో దాన్ని ఈసారి తమకు కేటాయించాలని జనసేన డిమాండ్ వస్తోంది.

కార్యదర్శికి ఎసరు

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వచ్చిన మిర్చి యార్డు కార్యదర్శి వినుకొండ ఆంజనేయులకు కూడా ఎసరు పెడుతున్నారు. ఆయన్ను మార్చి తమ వారిని తీసుకువచ్చేందుకు ఉత్తరాంధ్రకు చెందిన ఎమ్మెల్సీ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఆయన గతంలో గుంటూరు మున్సిపల్ కమిషనర్‌గా పని చేశారు. ఆయన కుమారుడు జిల్లా నిఘా విభాగం అధికారిగా పని చేస్తున్నారు. ఆయన కోడలు ప్రస్తుతం విశాఖపట్నం జిల్లాలోనే మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో పని చేస్తున్నట్లు తెలిసింది. అమెను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నుంచి మార్కెటింగ్‌కు డెప్యూటేషన్‌పై గుంటూరు తేవాలని చేసిన ప్రయత్నాలకు స్థానిక ప్రజా ప్రతినిధులు అడ్డుపడినట్లుగా చర్చ జరుగుతోంది. రెండు నెలల క్రితమే తమ మద్దతుతో వచ్చిన అధికారిని వెంటనే మార్చడం కుదరదని వారు తెగేసి



చెప్పడంతో కొత్త కార్యదర్శిగా వచ్చేందుకు మహిళా అధికారి చేసిన ప్రయత్నాలు తాత్కాలికంగా నిలిచిపోయినట్లు సమాచారం. ఆ విభాగంపై నిఘా పెట్టాల్సిన అధికారి భార్యనే ఇక్కడికి ఎలా తెస్తారని వారు ప్రశ్నించినట్లు తెలిసింది. దీంతో మంత్రి కూడా ఈ ఫైల్ పెండింగ్‌లో పెట్టినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

పదవుల బేరం

సీఆర్‌డీఏ చైర్మన్, మిర్చి యార్డు చైర్మన్, జిల్లా సహకార బ్యాంకు, జిల్లా సహకార మార్కెటింగ్ సంస్థలకు నియామకాలు జరగాల్సి ఉంది. మిర్చి యార్డు తమకు ఇచ్చి మిగిలిన మూడు పదవులు తెలుగుదేశం వారు తీసుకోవాలని జనసేన నేతలు అడుగుతున్నారు. అయితే, డీసీఎంఎస్ ఒక్కటే కేటాయిస్తామని తెలుగుదేశం నేతలు స్పష్టం చేస్తున్నారు. అదే సమయంలో తెలుగుదేశం పార్టీలోని కాపు నేతలు కూడా ఈసారి తమకు ఇవ్వాలని అడుగుతున్నారు. పెమ్మసాని చంద్రశేఖర్ కూడా ఆ వైపే మొగ్గు చూపుతున్నారు. మిగిలిన వారు మాత్రం కమ్మ సామాజిక వర్గానికి ఈ పదవి ఇవ్వాలని పట్టుబడుతున్నారు. కీలకమైన పదవి కావడంతో ఇక్కడ నేతల ప్రమేయం కన్నా చిన్న బాబు ప్రమేయమే ఎక్కువ ఉంటుందని భావిస్తున్న కొందరు నేతలు అటువైపు నుంచి నరుక్కొస్తున్నారు.

పోల్‌వాల్ట్ దూకుతున్న శ్రీనివాసులురెడ్డి (60 సంవత్సరాలు, బాపట్ల)



ఉరుకులెత్తిన ఉత్సాహం

గుంటూరు వెస్ట్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఆరోఏపీ మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్ షిప్–2024 పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గళ్లా మాధవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడా సాధనకు వయస్సుతో సంబంధం లేదని తెలిపారు. ఎనిమిది పదుల వస్సులోనూ పోటీల్లో పాల్గొనడం నిజంగా గొప్పదనమని కొనియాడారు. అవకాశం ఉన్నంత వరకు ప్రతిరోజూ వ్యాయామం, యోగా, క్రీడా సాధన గానీ చేయాలని సూచించారు. ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ లాల్ వజీర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 400 మంది స్త్రీ, పురుష వెటరన్ అథ్లెటిక్స్ వివిధ విభాగాల్లో పాల్గొన్నారని తెలిపారు. ఆదివారంతో ఈ పోటీలు ముగుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్, జ్యోతి ప్రజ్వలన నిర్వహించారు.



శివప్రసాద్ (75 సంవత్సరాలు, గుంటూరు)



శ్రీనివాసులురెడ్డి (60 సంవత్సరాలు, బాపట్ల)



ముత్యం లక్ష్మి (85 సంవత్సరాలు, విశాఖ)

సంతోషకర సమాజంతోనే ఆనంద జీవితం

సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్ వి.రమణ

ఏఎన్‌యూ : సమాజం సంతోషంగా ఉంటే మనం కూడా ఆనందమయ జీవితాన్ని గడుపుతామని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్ వి .రమణ అభిప్రాయపడ్డారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పూర్వ విద్యార్థుల సంఘ సమావేశం శనివారం యూనివర్సిటీ డైక్‌మన్ ఆడిటోరియంలో నిర్వహించారు. సమావేశానికి సంఘం డైరెక్టర్ ఆచార్య జి.వి.ఎస్.ఆర్. ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జస్టిస్ ఎన్.వి. రమణ మాట్లాడుతూ సమాజంలో అల్లర్లు, గొడవలు, కొట్లాటలు ఉంటే సుఖమైన జీవితాన్ని గడపలేమని తెలిపారు. ధన సంపాదన ముఖ్యమైనా దానికన్నా సమాజ హితానికి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. మాతృభాషకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. తాను డిగ్రీ పూర్తి కాగానే జర్నలిజం మీద ఆసక్తి ఉండటంతో ఈనాడు పత్రికలో విలేకరిగా పనిచేశానని పేర్కొన్నారు. ఆ రోజుల్లో జర్నలిజం అభివృద్ధికి ఎంతో గౌరవం ఉండేదని సూచించారు. వృత్తి పట్ల నిబద్ధత ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చునని ఆయన పేర్కొన్నారు. ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల సహకారం మరువలేనిదని తెలిపారు. ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య కె. రత్న షీలా మణి మాట్లాడుతూ విశ్వవిద్యాలయం దినదినాభివృద్ధి సాధించేందుకు ఎందరో సహకారం అందించారని పేర్కొన్నారు. ఉన్నత శిఖరాల వైపు పయనించిన ఎందరో పూర్వ విద్యార్థులు వర్సిటీకి రావడం ఆనందంగా ఉందన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సంఘ సమావేశాలు నిరంతరం కొనసాగేలా ప్రణాళికలు రూపొందించనున్నట్లు పేర్కొన్నారు.



నాగార్జున యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి. రమణ

ఏఐఐఎంఎస్ ప్రవేశ పరీక్షలో మనోడి ప్రతిభ



గాదె మను శశిధర్‌రెడ్డి

చేబ్రోలు: ఢిల్లీ ఏఐఐఎంఎస్ (ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్) నిర్వహించిన సూపర్ స్పెషాల్టీ ప్రవేశ పరీక్షలో జాయింట్ రీప్లేస్‌మెంట్ అండ్ రీ కన్‌స్ట్రక్షన్ విభాగంలో చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలేనికి చెందిన గాదె మను శశిధర్‌రెడ్డి రెండో ర్యాంక్ సాధించినట్లు కుటుంబ సభ్యులు శనివారం తెలిపారు. ఇండియాలోని నాలుగు ఎయిమ్స్ కళాశాలలు అయిన రుషికేశ్, రాయపూర్, భోపాల్, బిటానియాల్లో ఒక్కొక్క సీటు చొప్పున నాలుగు మాత్రమే ఉన్నాయి. రెండో ర్యాంక్ సాధించిన మను శశిధర్‌రెడ్డి ఈ నాలుగు కళాశాలల్లో ఒకదానిలో 2025 జనవరిలో ప్రవేశం పొందనున్నాడు.

చిన్నతనం నుంచి చదువులో చురుకు

చేబ్రోలులోని కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కేసీ హైస్కూల్ హెచ్‌ఎం త్రిపుర సుందరరెడ్డి, లక్ష్మీ నాగేంద్రల కుమారుడు శశిధర్‌రెడ్డి చిన్నతనం నుంచి చదువులో రాణించి నేడు జాతీయ స్థాయిలో జరిగిన ప్రవేశ పరీక్షలోను రెండో ర్యాంక్ సాధించాడు. స్వాతంత్ర సమరయోధుడు గాదె సైరా చిన్నప్పరెడ్డి వంశంలోని 5వ తరానికి చెందిన వారు. పదో తరగతిలో 600 మార్కులకు గాను 584మార్కులు సాధించాడు. తల్లిదండ్రుల ఆకాంక్షల మేరకు ఇంటర్‌లో బైపీసీలో విద్యనభ్యసించి 974మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 12వ ర్యాంక్ సాధించాడు. ఎంసెట్‌లో మొదటి ప్రయత్నంలోనే 553వ ర్యాంక్ పొంది గుంటూరు మెడికల్ కాలేజీలో సీటు సాధించాడు. 2018–19లో ఎంబీబీఎస్ పట్టా అందుకున్నాడు. హైదరాబాద్ నిమ్స్‌లో ఉన్న తొమ్మిది సీట్లలో సెంట్రల్ కోటాలో మొదటి సీటు ఎంఎస్ ఆర్థోపెడిక్‌లో చేరాడు. 2023లో ఎంఎస్ ఆర్థోతో పాటు డీఎన్‌బీ ఆర్థోను పూర్తి చేశాడు.2023 ఫిబ్రవరిలో జరిగిన తెలంగాణా స్టేట్ ఆర్థోపెడిక్ సర్జన్స్ కాన్ఫరెన్స్‌లో పేపర్ ప్రజెంటేషన్‌లో గోల్డ్‌మెడల్, క్విజ్‌లో ఫస్ట్ ప్రైజ్ సాధించాడు. 2024 ఫిబ్రవరిలో కరీంనగర్‌లో జరిగిన తెలంగాణా స్టేట్ ఆర్థోపెడిక్స్ సర్జన్స్ కాన్ఫరెన్స్‌లో బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్, సర్టిఫికెట్ అందుకున్నాడు. 2023 మే 1 నుంచి 5 వరకు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో జరిగిన స్పైన్ వీక్ వరల్డ్ కాన్ఫరెన్స్‌లో పేపర్ ప్రజెంటేషన్‌లో ప్రతిభ చాటి మన్ననలు పొందాడు. జాతీయ స్థాయిలో జరిగిన ప్రవేశ పరీక్షలో రెండో ర్యాంక్ సాధించిన శశిధర్‌రెడ్డిని కొత్తరెడ్డిపాలెం గ్రామస్తులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

హద్దు మీరితే జరిమానాల మోత

కొత్త సంవత్సరంలో రోడ్డు భద్రత నిబంధనలు మారనున్నాయి. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే జరిమానాల మోత మోగనుంది. ఇకపై వాహన యజమానులు జాగ్రత్త పడాల్సిందే ! రహదారి నిబంధనలను కఠిన తరం చేసేందుకు పోలీసు, రవాణాశాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఇటీవల హైకోర్టు ధర్మాసనం నిబంధనలు సరిగా అమలు చేయడం లేదంటూ పోలీసు, రవాణాశాఖ అధికారులపై అక్షింతలు వేసింది. ఈ క్రమంలో నిబంధనలు పాటించని వాహనదారులపై కొరడా ఝుళిపించేందుకు పోలీసు రవాణాశాఖ అధికారులు సిద్ధం కాబోతున్నారు.

- వాహన యజమానులు ఇక జాగ్రత్త పడాల్సిందే !
- నూతన సంవత్సరం నుంచి నిబంధనలు అమలు
- పాటించకపోతే భారీ జరిమానాలు
- పోలీసులు, రవాణా శాఖ సంయుక్తంగా కార్యాచరణ

పట్నంబజారు: రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఈ ఏడాది జూన్ నుంచే నూతన రహదారి భద్రతా నియమాలు అమల్లోకి వచ్చాయి. అయితే, వాటిని అంత పక్కాగా అమలు చేయలేదనే చెప్పాలి. రోజురోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నియంత్రణ, హైకోర్టు ఆదేశాల అమలులో భాగంగా అధికారులు నిబంధనలను కఠినతరం చేసేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే హెల్మెట్ ధారణపై ప్రత్యేక డ్రైవ్‌లతో ముందుకు వెళుతున్న పోలీసు, రవాణాశాఖ అధికారులు ఇకపై పూర్తిస్థాయి నిబంధనలపై దృష్టి సారించనున్నారు. గతంలో మైనర్లు వాహనం నడిపితే చిన్నాచితక జరిమానాలతో సరిపోయేది. త్వరలో మైనర్‌లు వాహనాలు నడిపితే రూ. 25వేల జరిమానాతో పాటు వారి తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేసి జైలుశిక్ష పడేలా చూడనున్నారు. మైనర్లు వాహనాలు నడిపితే మూడేళ్ల వరకు జైలుశిక్ష పడే అవకాశం ఉంది.



వాహనదారుడికి కౌన్సెలింగ్ ఇస్తున్న ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్

వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు

నూతన సంవత్సరం జనవరి నుంచి ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా అమలు చేసే అవకాశాలు ఉన్నాయి. దీనిపై ఇప్పటికే ఆటోవాలాలు, ద్విచక్ర వాహనాదారులకు అవగాహన కార్యక్రమాను కూడా పోలీసులు నిర్వహిస్తున్నారు. నిబంధనలు పాటించకపోతే భారీ జరిమానాల వడ్డింపు మాత్రం తథ్యమేనని తెలుస్తోంది. ఇకపై వాహనదారులు జాగ్రత్తలు, నిబంధనలు పాటించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే గుంటూరు నగర ట్రాఫిక్ డీఎస్పీ ఎం. రమేష్ పర్యవేక్షణలో ఈస్ట్, వెస్ట్ ట్రాఫిక్ సీఐలు ఏ. అశోక్, సింగయ్యలు హెల్మెట్ ధారణపై అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించటంతో పాటు, భారీగా జరిమానాలు విధిస్తున్నారు.

ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలి



వాహనాలతో రోడ్డు ఎక్కే ప్రతి ఒక్కరూ కచ్చితంగా నిబంధనలు పాటించాలి. నూతన సంవత్సరంలో నిబంధనల అమలుపై దృష్టి సారిస్తున్నాం. ఇప్పటికే అధికారులకు పలు సూచనలు చేశాం. మైనర్లు వాహనాలు నడపడం వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమా దాలు జరుగుతుయని గుర్తించాం. ఇకపై జిల్లా వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేస్తాం. జాతీయ రహదారులతో పాటు, వాహనదారులు సర్వీస్ రోడ్లను కూడా వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. తద్వారా ప్రమాదాలు తగ్గించవచ్చు. జాతీయ రహదారులపై ద్విచక్ర వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి. మలుపులు, సర్కిళ్ల వద్ద నిర్లక్ష్యం నిండు ప్రాణాలను బలితీసుకుంటుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. నిబంధనలు పాటించకుంటే మాత్రం చట్టప్రకారం జరిమానాలు తప్పవు.

–కె. సీతారామిరెడ్డి, డీటీసీ, గుంటూరు జిల్లా

నిబంధనల ప్రకారం జరిమానాలు ఇలా....

- లైసెన్స్ లేకుండా డ్రైవ్ చేస్తే గతంలో రూ.500 జరిమానా విధించేవారు. ఇప్పుడు దాన్ని రూ.5,000కు పెంచనున్నారు.
- రెడ్‌లైట్ ఉల్లంఘించి వాహనాలు నడిపితే రూ 500 జరిమానా పడుతుంది.
- అతివేగం, ర్యాష్, స్నేక్ డ్రైవింగ్‌లు చేస్తే రూ 1000 జరిమానాతో పాటు కేసు నమోదు చేస్తారు.
- రాంగ్ రూట్‌లో వాహనాన్ని నడిపితే రూ.5000 ఫైన్ విధిస్తారు.
- డ్రంక్ అండ్ డ్రైవ్ (మద్యం తాగి వాహనం నడిపితే) గతంలో రూ.2,300 వేలుగా ఉన్న జరిమానా, ఇప్పుడు ఏకంగా 10వేలకు పెంచగా, అమలు కూడా అవుతోంది. దీనితో పాటు ఒకటి లేదా రెండు రోజుల జైలు శిక్ష కూడా విధించే అవకాశాలు ఉన్నాయి.
- రేసింగ్, స్పీడ్ డ్రైవ్ చేస్తే రూ.5 వేలు వసూలు చేయనున్నారు.
- హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనం, సీట్ బెల్టు ధరించకుండా కార్లు నడిపితే రూ.వెయ్యి కట్టాల్సిందే. దీనికి తోడు మూడు నెలలు లైసెన్స్ రద్దు చేస్తారు.
- అత్యవసర వాహనాలకు దారి ఇవ్వకుండా వెళితే నిబంధనలు పాటించాలి, లేనిపక్షంలో రూ. 10వేలు జరిమానా, కేసు కూడా పెట్టే అవకాశాలు ఉన్నాయి.
- ద్విచక్ర వాహనాల్లో ట్రిబుల్ రైడింగ్ చేస్తూ పట్టుబడితే రూ.2 వేల వరకు చలాన్లు రాస్తారు.
- ఇన్సూరెన్స్ లేకుండా వాహనాన్ని నడిపితే రూ.2 వేలు జరిమానా చెల్లించాలి

క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీ ప్రొటెక్షన్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శిగా ప్రభుదాస్



తాడేపల్లి రూరల్: ఏపీ ఎస్సీ, ఎస్టీ ప్రొటెక్షన్ కౌన్సిల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంటీఎంసీ పరిధిలోని యర్రబాలేనికి చెందిన దాసరి ప్రభుదాస్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు బుల్లా రాజారావు శనివారం ప్రభుదాస్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాకాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొండవీటి వాగు వెడల్పు సర్వేను నిలిపివేయాలి



తాడేపల్లి రూరల్: రాజధాని ముఖ ద్వారమైన ఉండవల్లిలో కొండవీటి వాగు వెడల్పు సర్వేను వెంటనే నిలిపివేయాలని రాజధాని రైతుసంఘం అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి కోరారు. ఆయన శనివారం ఉండవల్లిలో సీఆర్‌డీఏ అధికారులు ఏర్పాటు చేసిన మార్కింగ్‌ను రైతులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కడో పై నుంచి వచ్చే కొండవీటి వాగును వెడల్పు చేసేకంటే అమరావతి నుంచి వచ్చే వాగులోకి డైవర్షన్ చేసి కృష్ణానదిలోకి కలిపే అవకాశం ఉందని తెలిపారు. దీనివల్ల తక్కువ ఖర్చు అవుతుందన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి కొండవీటి వాగు డైవర్షన్ నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించడం తప్పనిసరి

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: నగరంలో ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్లే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. పోలీస్ కల్యాణ మండపంలో శనివారం గుంటూరు నగరంలోని ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఒకరి మధ్య ఒకరికి సమన్వయం లేకపోవడం, ఆటోలు నిలుపుదల ప్రదేశాలు లేకపోవడంతో ఇష్టానుసారంగా రహదారులపై నిలుపుదల చేస్తున్నారని అన్నారు. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, తద్వారా ట్రాఫిక్ సమస్యలకు ప్రధాన కారణమవుతున్నాయని పేర్కొన్నారు. ఆటోడ్రైవర్ల ముసుగులో కొందరు అసాంఘిక చర్యలకు పాల్పడుతున్నారని, వారి వల్ల మిగతా ఆటోడ్రైవర్లకు చెడు పేరు వస్తోందన్నారు. ఆటోలు అద్దెకిచ్చే వేళల్లో పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని చెప్పారు. త్వరలో సాంకేతిక పరిజ్ఞానంతో ఆటోడ్రైవర్ల వివరాలను క్యూఆర్ కోడ్ చిరునామాతో ఉన్న స్టిక్కర్లు అతికిస్తామని అన్నారు. గుంటూరు పశ్చిమ, తూర్పు ట్రాఫిక్ పీఎస్ పరిధిలోని ఆటోలకు ప్రత్యేకమైన నంబర్ కేటాయిస్తామని తెలిపారు. జిల్లా ఏఎస్పీ (క్రైం) కె.సుప్రజ మాట్లాడుతూ ఆటోడ్రైవర్ల ముసుగులో కొందరు మహిళలను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు. అటువంటి వ్యక్తులు ఉన్నట్లైతే పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు. మహిళా పీఎస్ డీఎస్పీ సుబ్బారావు, సీఐలు ఎ.అశోక్‌కుమార్ (తూర్పు), సింగయ్య (పశ్చిమ), ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాద సమయాల్లో గోల్డెన్ అవర్ ఎంతో కీలకం

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: జాతీయ రహదారులపై జరిగే రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని గోల్డెన్ అవర్‌లో సమీప ఆసుపత్రికి తీసుకెళ్తే ఎంతో ప్రయోజనముంటుందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. బాధితులను సమీప ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళితే కేంద్ర ప్రభుత్వ బీమా పథకం ద్వారా రూ.30 వేల వరకు నగదు రహిత సేవలు పొందవచ్చని తెలిపారు. ప్రమాదాన్ని చూసిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1033 చేస్తే జాతీయ రహదారుల అధికారులు తక్షణమే స్పందిస్తారని తెలిపారు. ప్రజలకు అవగాహన కలిగించే విధంగా అధికారులు ప్రమాద నివారణలపైనా, సహాయక చర్యలపైనా సమావేశాలు నిర్వహించాలని ఆమె ఆదేశించారు. గుంటూరు నగరంలో ప్రస్తుతం ట్రాఫిక్ ఇబ్బందులున్నాయని, వీటిని నివారించేందుకు కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్‌తో పాటు స్పీడ్ బ్రేకర్లు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్లపై గుంతలను పూడ్చడంతోపాటు అవకాశమున్నంత వరకు విస్తరణ చేపట్టాలని తెలిపారు. జాతీయ రహదారులపై వెళ్లే వ్యర్థాలు తరలించే వాహనాలపై పట్టాలతో కప్పాలని చెప్పారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు సర్వీస్ రోడ్లలోనే ప్రయాణించేలా చర్యలు తీసుకోవాలన్నారు. భవన, దుకాణ సముదాయాల ముందు ఇష్టం వచ్చినట్లు వాహనాలు పార్కింగ్ చేస్తున్నారని, సెల్లార్‌ను వాడుకోవాలని తెలిపారు. ప్రైవేట్ వాహనదారులు మద్యం తాగి విధులు నిర్వహిస్తే వాహన యజమానిపై కేసులు నమోదు చేయాలని చెప్పారు. పెదకాకాని వద్ద అప్రోచ్ రోడ్డు నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన పరికరాలు జీఎంసీ అందించాలని తెలిపారు. జాతీయ రహదారులపైనా ప్రమాదాల నివారణతోపాటు జరిగితే స్పందించేందుకు 24 గంటలు పనిచేసే బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. సమావేశంలో జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, డీటీసీ కె.సీతారామిరెడ్డి, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, ఎంటీఎంసీ కమిషనర్ ఆలీమ్ బాషా, ఏపీఎస్‌ఆర్టీసీ ఆర్‌ఎం రవికాంత్, 108 కోఆర్డినేటర్ నాగదీప్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి



షేక్ మల్లిక మృతదేహం

పెదకాకాని: వివాహిత అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఘటన నంబూరులో చోటు చేసుకుంది. వివరాలు.. పెదకాకాని మండలం నంబూరు గ్రామానికి చెందిన షేక్ మల్లికకు గతంలో అదే గ్రామానికి చెందిన అక్బర్‌తో వివాహం అయింది. వారికి ఇద్దరు సంతానం. కొంతకాలంగా ఇద్దరి మధ్య మనస్పర్థలు ఉన్నాయి. తరచూ గొడవలు జరుగుతుండటంతో ఇద్దరూ విడాకులు తీసుకున్నారు. ఆ తరువాత మల్లిక గ్రామంలోని విజయభాస్కర్ నగర్‌కు చెందిన కారుమూరి ప్రేమ్‌కుమార్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. ప్రస్తుతం రెండేళ్ల వయస్సు ఉన్న రూహి అనే పాపను పెంచుకుంటున్నారు. ఎప్పటి మాదిరిగానే శనివారం ఉదయం ప్రేమ్‌కుమార్ సెంట్రింగ్ పనికి వెళ్లాడు. ఇంటికి వచ్చి చూసే సరికి మంచంపై పడి ఉంది. కేకలు వేసినా పలకకపోవడంతో చనిపోయినట్లు భావించి పెదకాకాని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసుల దర్యాప్తులో వివాహిత మెడపై స్వల్పగాయాలు ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు మల్లిక(29) గొంతు నులిమి హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. సమీపంలో ఉన్న సీసీ కెమెరాల్లో ఇద్దరు వ్యక్తులు ముఖానికి మాస్క్ ధరించి వచ్చినట్లు గుర్తించారు. భర్త ప్రేమ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ టీపీ నారాయణస్వామి తెలిపారు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

ప్రజా ఆందోళనతో వెనక్కి తగ్గిన ప్రభుత్వం

గుంటూరులో ఇళ్లకు పెట్టిన విద్యుత్ స్మార్ట్ మీటర్ల తొలగింపు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్) : ప్రజాందోళనతో కూటమి ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ప్రజలు ఆందోళన చేయడంతో గుంటూరు ఇన్నర్‌రింగ్ రోడ్డు సమీపంలోని సుందరయ్యనగర్‌లో పేదలు, దళితులు, బలహీన వర్గాలకు పెట్టిన స్మార్ట్ మీటర్లను తొలగించారు. గత గత 15 రోజుల క్రితం సుందరయ్యనగర్‌లో వినియోగదారుల ప్రమేయం లేకుండానే బలవంతంగా 16 ఇళ్లకు పాత విద్యుత్ మీటర్ల స్థానంలో స్మార్ట్‌మీటర్లను బిగించారు. ఇందులో అత్యధిక మంది విద్యుత్ రాయితీ పొందుతున్న దళితులు, బలహీన వర్గాలే. విషయం తెలుసుకున్న స్థానిక ప్రజలతో పాటు సీపీఎం నేతలు కూడా అడ్డుకోవడంతో మిగిలిన 300 ఇళ్లకు మీటర్లు పెట్టకుండా ఆదాని కంపెనీ సిబ్బంది వెనక్కి తగ్గారు. అప్పటి నుంచి స్థానిక ప్రజలు స్మార్ట్ మీటర్లు తొలగించాలని స్థానికంగానూ, విద్యుత్ ఎస్ ఈ కార్యాలయం వద్ద దశలవారీగా ఆందోళనలు నిర్వహించారు. కార్యాలయాలు ముట్టడించారు. అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. దీంతో ప్రజల ఆందోళనకు తలొగ్గిన అధికారులు ఇచ్చిన ఆదేశాల మేరకు అదాని సంస్థ సిబ్బంది శనివారంనాడు స్మార్ట్ మీటర్లను తొలగించి మళ్లీ ఆ స్థానంలో పాత మీటర్లు బిగించారు. స్మార్ట్ మీటర్లను తొలగించిన వెంటనే సమాచారం తెలుసుకున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్. బాబూరావు, నగర కార్యదర్శి నళినీ కాంత్, స్థానిక నేతలు కలిసి సుందరయ్య నగర్ లో పర్యటించారు. స్మార్ట్ మీటర్ల తొలగింపు కోసం పోరాడిన ప్రజలను అభినందించారు.

సివిల్స్ పరీక్షలపై అవగాహన అవసరం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎం.క్యూరి, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, యూటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: సివిల్ సర్వీసెస్‌లో భాగమైన ఐఏఎస్, ఐపీఎస్ తదితర సర్వీసులు భారతదేశంలో అత్యున్నత ఉద్యోగాలని, వాటిని సాధించాలంటే పాఠశాల స్థాయి నుంచే అవగాహన పెంచుకోవాలని ఎం. క్యూరీ పేర్కొన్నారు. యూటీఎఫ్ కార్యాలయంలో కేటీఆర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ ఆధ్వర్యంలో 'సివిల్ సర్వీసెస్ – ప్రాథమిక అంశాలు' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్ లక్ష్యంగా పెట్టుకుని చదవాలని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ డిగ్రీ అర్హతతో సివిల్ సర్వీసెస్ పరీక్ష రాయవచ్చని, పాఠ్యపుస్తకాలతో పాటు పాఠశాల స్థాయి నుంచి న్యూస్ పేపర్స్ చదువుతూ కరెంట్ ఎఫైర్స్ అధ్యయనం చేయాలని చెప్పారు. పరీక్ష ప్రిలిమినరీ, మెయిన్స్, ఇంటర్వ్యూ అనే మూడు దశల్లో ఉంటుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలో కీలకమైన ఉద్యోగులందరూ సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైన వారేనని చెప్పారు. సమావేశంలో సన్ అధ్యక్షుడు కె.యశ్వంత్, సాయిరామ్, అభీష్, యూటీఎఫ్ నాయకులు ఎం.కళాధర్, జన్నవిజ్ఞాన వేదిక బి.ప్రసాద్, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఏపీ క్రీడాకారులు అంతర్జాతీయంగా రాణించాలి

ప్రారంభించిన శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న వారికి జ్ఞాపికలు అందజేస్తున్న రవినాయుడు

తాడేపల్లి రూరల్: ఏపీ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. తాడేపల్లి పెనుమాకలో శనివారం 68వ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ త్రోబాల్ అండర్ 17 బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏపీని క్రీడాంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని తెలిపారు. ఏషియన్, ఖేలో, నేషనల్ పోటీల్లో రాణించిన క్రీడాకారులకు రు. 3 లక్షల ప్రోత్సాహకం, నేషనల్స్‌లో రాణించి వారికి యూనిఫాం ఉద్యోగాల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కల్పనకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని తెలిపారు. క్రీడల్లో రాణించి ప్రపంచ వ్యాప్తంగా దేశ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేయాలని సూచించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో టీటీడీ బోర్డు తమ్మిశెట్టి జానకీదేవి, తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు పాల్గొన్నారు.

సజావుగా చాంబర్ ఎన్నికలు



నగరంపాలెం: జిన్నాటవర్ కూడలిలోని ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు శనివారం సజావుగా కొనసాగాయి. ఉదయం 8 గంటలకు కార్యాలయంలో సర్వసభ్య సమావేశం మొదలైంది. ఆ తర్వాత 10 గంటలకు ప్రారంభించాల్సిన ఎన్నికల ప్రక్రియ దాదాపు గంటన్నరకు పైగా ఆలస్యమైంది. ఉదయం 11.30 గంటలకు మొదలై, రాత్రి 7.30 వరకు కొనసాగింది. ఈసారి ఓట్లు వేసేందుకు వ్యాపార ఓటర్లు ఆసక్తి చూపారు. దీంతో బారులు తీరారు. అధ్యక్ష పదవి రేసులో ఉన్న యేల్చూరి వెంకటేశ్వర్లు, రంగా బాలకృష్ణ, రంగా రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, చాంబర్ మాజీ అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు, కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్‌తో పాటు పలువురు ఓటు హక్కుని వినియోగించుకున్నారు. రాత్రికి 985 ఓట్లు పోలైనట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి. అయితే, చాంబర్ వద్ద ముందస్తు ఏర్పాట్లను సరిగా చేయకపోవడంతో ఒకింత ఓటర్లు ఇబ్బందులకు గురయ్యారు.

ఉపాధి మార్గాలను మెరుగు పరుచుకోవాలి

గుంటూరు వెస్ట్: మహిళలు స్వయం సహాయక బృందాలుగా ఏర్పడి ఉపాధి మార్గాలను మెరుగు పరుచుకోవాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి.విజయలక్ష్మి తెలిపారు. శనివారం స్థానిక రెవెన్యూ కళ్యాణ మండపంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వెలుగు సంయుక్త ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో తయారు చేయించిన ఆహార పదార్థాలు, ఇతర వస్తువులను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రముఖ సంస్థలన్నీ చిన్న చిన్న వ్యాపారాలతోనే ప్రారంభమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జీఎం జయలక్ష్మి, ఏపీ ఫుడ్‌ప్రాసెసింగ్ సొసైటీకి చెందిన సుభాష్ పాల్గొన్నారు.